# దళిత కుటుంబాల్లో వెలుగులు

- ఉమ్మడి మెదక్ జిల్లాలో విజయవంతంగా పథకం అమలు
- సక్సెస్‌ఫుల్‌గా యూనిట్లు రన్ చేస్తున్న లబ్ధిదారులు
- ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న దళిత కుటుంబాలు
- తాము ఉపాధి పొందుతూ.. మరో పది మంది కల్పన
- నాటి దళిత చైతన్య జ్యోతి... నేటి దళితబంధు
- మారుతున్న రాతలు






సిద్దిపేట, నవంబర్ 1(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సీఎం కేసీఆర్ దళిత కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారు. ప్రభుత్వం దళితబంధు కింద అందించిన ఆర్థిక సాయంతో లబ్ధిదారులు బాగుపడి తమ కాళ్ల మీద తాము నిలబడి..మరో పది మందికి ఉపాధినిస్తున్నారు.దళితబంధు పథకం దళితుల ఆర్థికాభివృద్ధి తోపాటు సామాజిక అసమానతలు తగ్గించడానికి దోహదపడుతున్నది. దళితబంధు సాయం పొందిన కుటుంబాలు మరో పది కుటుంబాలకు వెలుగులు పంచుతున్నాయి. ఒక్కో లబ్ధిదారునికి రూ. 10 లక్షల చొప్పున లబ్ధిదారుకు ప్రభుత్వం పూర్తి గ్రాంట్‌గా ఆర్థిక సాయం అందించింది. రక్షణ నిధిని సైతం ఏర్పాటు చేసింది. లబ్ధిదారుల నుంచి రూ. 10 వేలు సేకరించి, మరో రూ 10 వేలు ప్రభుత్వం జమ చేసి దళిత రక్షణ నిధిని ఏర్పాటు చేసి ఆ కుటుంబాలకు ధీమాను కల్పిస్తున్నది.

### ఉమ్మడి మెదక్ జిల్లాలో..

తొలి విడతలో ఉమ్మడి మెదక్ జిల్లాలో రూ.115.40 కోట్లు 1,194 కుటుంబాలకు అందించింది.వారంతా ఇష్టమైన యూనిట్లు ఎంచుకుని విజయవంతంగా నడుపుకొంటున్నారు. ప్రభుత్వం అందించిన చేయూతతో ఒకరు పాడిపరిశ్రమ, మరొకరు నాలుగు చక్రాల వాహనాలు, ల్యాబ్ టెకిక్నీషియన్, కారు ట్యాక్సీ..క్లాత్ ఎంపోరియం ..వరికోత మిషన్, టెంట్‌హౌస్, కోళ్ల ఫారం.. ఇలా అనేక వ్యాపారులు ప్రారంభించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఇప్పటి వరకు 1,194 కుటుంబాలకు దళతబంధును అందించారు. సిద్దిపేట జిల్లాలో 495 కుటుంబాలకు రూ.45.50 కోట్లు, మెదక్ జిల్లాలో 255 కుటుంబాలకు రూ.25.50 కోట్లు, సంగారెడ్డి జిల్లాలో 444 కుటుంబాలకు రూ.44.40 కోట్లు కుటుంబాలకు అందించారు.ఈ పథకం ద్వారా ఒక్కో లబ్ధిదారునికి రూ. 10 లక్షల ఆర్థిక చేయూతను అందించింది. దళిత బంధులో 60కి పైగా ఉన్న వివిధ రకాల యూనిట్లలో వారికి నచ్చిన వాటిని ఏర్పాటు చేసుకున్నారు. ప్రభుత్వం అందించిన సాయం ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈ పథకాన్ని మరింతగా విస్తరించాలని చెప్పి ప్రతి నియోజకవర్గానికి 1100ల యూనిట్లు కేటాయించారు. ఈ లెక్కన ఉమ్మడి మెదక్ జిల్లాలో సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, మెదక్, నర్సాపూర్, సంగారెడ్డి, ఆందోల్, జహీరాబాద్, నారాయణఖేడ్, పటాన్ చెరు నియోజకవర్గాలతో పాటుగా సిద్దిపేట జిల్లాలోని జనగామ నియెజకవర్గంలోని నాలుగు మండలాలు, మానకొండూరు నియోజకవర్గంలోని బెజ్జంకి మండలం ఉన్నాయి.11 నియోజక వర్గాలకు లెక్క వేసుకున్నా సుమారుగా 12 వేల మందికి లబ్ధి చేకూరనున్నది. ఆ దిశగా లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించి అర్హులైన వారిని ఎంపిక చేసి గ్రౌండింగ్ చేస్తున్నారు. వెంటనే యూనిట్లు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

### నాటి దళిత చైతన్యజ్యోతి.. నేటి దళితబంధు

దళితబంధు కార్యక్రమం ఇవాళ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నది.సీఎం కేసీఆర్ నాడు సిద్దిపేట ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే దళిత చైతన్యజ్యోతి కార్యక్రమాన్ని చేపట్టారు. సుమారు 25 ఏండ్ల కిందట సిద్దిపేట నియోజకవర్గంలోని నంగునూరు మండలం మగ్దుంపూర్, చిన్నకోడూరు మండలం రామునిపట్ల గ్రామాలతో పాటు దుబ్బాక మండలం రాజక్కపేట, ఎల్లాపూర్ గ్రామాల్లోని దళిత చైతన్య కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రస్తుతం రాజక్కపేట, ఎల్లాపూర్ గ్రామాలు దుబ్బాక నియోజకవర్గంలో ఉన్నాయి. దళిత చైతన్యజ్యోతి కార్యక్రమం ఉద్దేశాలను ఆనాడే కేసీఆర్ వారికి వివరించి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మాడల్‌గా తీసుకున్న గ్రామాల్లోని దళిత వాడల్లో అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి చేపట్టారు. అందరూ సంఘటితంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని చెప్పారు. దళితుల అభ్యున్నతికి మాడల్‌గా తీసుకున్న గ్రామాల్లోని వారి కోసం ట్రాక్టర్లు ఇప్పించారు. ఏ పని అయినా సాముహికంగా చేసుకోవాలని సూచించారు. సాముహిక వ్యవసాయ బావుల తవ్వకం కోసం క్రేన్‌లు ఇప్పించారు. ఇండ్లు కట్టుకునేలా ప్రోత్సహించి నిర్మించారు. శ్రమదానాలు చేసి రోడ్లు వేసుకున్నారు. ఇలా ఎన్నో పనులు చేపట్టారు. నాటి దళిత చైతన్య జ్యోతి కార్యక్రమం స్ఫూర్తితోనే ఇవ్వాళ 'దళితబంధు' కార్యక్రమం ప్రవేశపెట్టి రాష్ట్రంలో దిగ్విజయంగా అమలు చేస్తున్నది.


దళితబంధులో ఫౌల్ట్రీ ఫాం వేసిన శామల్ల పద్మయ్య

### ఫౌల్ట్రీ ఫాంతో ఉపాధి

- ఆర్థికంగా ఆసరాగా నిలిచిన దళితబంధు
- సీఎం కేసీఆర్‌కు జీవితకాలం రుణపడి ఉంటా..

రామాయంపేట రూరల్, నవంబర్ 1: సీఎం కేసీఆర్, తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన దళితబంధులో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న. దళితబంధుతో ప్రభుత్వం రూ.10 లక్షలు అందజేసింది. దీంతో నా సొంత వ్యవసాయ పొలంలో ఫౌల్ట్రీ ఫాం షెడ్డును నిర్మిస్తున్నా. సుమారు 5వేల కోళ్ల పెంపకం కోసం ఈ నిర్మాణాన్ని చేపడుతున్నా. మరో వారం రోజుల్లో కోడి పిల్లలు వస్తాయి. వాటితో నా జీవనోపాధి మెరుగుపడుతుంది. గతంలో వ్యవసాయ కూలీగా పని చేసి కుటుంబాన్ని పోషించేవాడిని. సీఎం కేసీఆర్ సార్ ఇచ్చిన దళితబంధుతో నా కల సాకారమైంది. వారం లోపల కోడి పిల్లలు రావడంతో 42 రోజుల్లో ఓ విడత అమ్మకానికి వస్తాయి. అప్పటివరకు వాటిని సాకుతూ, కుటుంబసభ్యులతో వ్యవసాయ పనులు చేసుకుంటున్నాం. దళితబంధు పథకం కింద రూ.10 లక్షలు అందించిన సీఎం కేసీఆర్‌కు, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి జీవితకాలం రుణపడి ఉంటాం. దళితబంధు అందించిన సీఎం కేసీఆర్ సార్‌ను జీవితాంతం గుర్తుంచుకుంటాం.

### నాడు డ్రైవర్‌ని . . .నేడు ఓనర్‌ని..



ముఖ్యమంత్రి కేసీఆర్ పుణ్యమా అని దళితబంధు పథకంతో డ్రైవర్‌గా ఉన్న నేను ఓనరునయ్యాను. హైదరాబాద్‌లో డ్రైవర్‌గా జీతం చేస్తూ నానా ఇబ్బందులు పడ్డాను. దళితబంధు పథకంలో నేను ట్రాక్టర్‌ను కొనుగోలు చేశాను. నా పొలం పనులను సొంత ట్రాక్టర్‌తోనే చేసుకుంటూ ఇతరులకు కిరాయికి వెళ్తున్నా. సొంత గ్రామంలోనే ఉంటూ ఉపాధి పొందడం చాలా సంతోషంగా ఉంది. ట్రాక్టర్‌తో అన్ని ఖర్చులు పోనూ నెలకు సుమారు రూ.30నుంచి 35 వేల వరకు సంపాదిస్తున్నాను. జీతం కోసం డ్రైవర్ పని చేసినప్పుడు ఎన్నో అవమానాలు పడ్డాను. ఆత్మగౌరవాన్ని చంపుకొని ఓనర్ ఏది చెబితే అది చేసేవాడిని. ఇప్పుడు ముఖ్యమంత్రి కేసీఆర్ సార్ దయవల్ల ఆత్మగౌరవంతో సొంత గ్రామంలో బతుకుతున్నాను. ట్రాక్టర్‌కు పని బాగా దొరకడంతో ఆర్థికంగా బలపడుతున్నాను. ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన మేలును ఈ జన్మలో మర్చిపోలేను. దళితులు బాగు పడాలంటే ముఖ్యమంత్రి కేసీఆర్ మళ్లీ సీఎం కావాలి. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మా దళితుల మద్దతు ఎప్పటికీ ఉంటది.

-ట్రాక్టర్‌తో బేగరి మల్లేశం, తిర్మలాపూర్, నర్సాపూర్

### మా బతుకులను మార్చిన దేవుడు సీఎం కేసీఆర్ సార్

నిజాంపేట మండలం రాంపూర్‌కు చెందిన నర్సింహులు, నేను కలిసి దళితబంధు పథకం కింద హార్వేస్టర్‌ను కొనుగోలు చేశాం. రూపాయి ఖర్చు కానీ, పైరవీలు లేకుండా ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన హార్వేస్టర్‌తో రాంపూర్ గ్రామ చుట్టుపక్కలా 2 నెలలపాటు వరి కోతలు కోసినం. దాదాపుగా రూ.1.40 వేల ఆదాయం వచ్చింది. సీఎం కేసీఆర్ సార్ తీసుకొచ్చిన దళితబంధు పథకంతో దళితుల బతుకులు మారాయి. వేరే వాళ్ల దగ్గర కూలీలుగా ఉన్న మేము నేడు దళిత బంధుతో ఓనర్లుగా మారినం. అప్పు లేకుండా ప్రభుత్వం హార్వేస్టర్‌ను ఇవ్వడంతో వచ్చిన ప్రతి పైసా లాభమే. మా బతుకులను మార్చిన సీఎం కేసీఆర్ మాకు దేవుడు. ఆయనకు ఎల్లప్పుడు రుణపడి ఉంటాం.

- ఎల్ల చిన్న పోచయ్య, దళితబంధు లబ్ధిదారుడు, రాంపూర్ గ్రామం, నిజాంపేట మండలం





### ఓనర్‌గా మారడం సంతోషం

15 సంవత్సరాలుగా సుతారి, సెంట్రిగ్ పని చేసుకుంటూ జీవనం కొనసాగించాను.సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు సహకారం వల్ల దళిత బంధు పథకం కింద సెంట్రింగ్ డబ్బాతో పాటు మిల్లరు మిషన్ తీసుకున్నా.. కూలీగా పనిచేసిన నేను సెంట్రింగ్ సామగ్రితో ఓనర్‌గా మారడం సంతోషంగా ఉంది. అన్ని ఖర్చులు పోను నెలకు రూ.20వేల నుంచి రూ.30వేల వరకు ఆదాయం పొందుతున్నా. మాలాంటి ఆనేక మంది దళితుల జీవితాల్లో వెలుగు నింపిన సీఎం కేసీఆర్ రుణం తీర్చుకోలేనిది. మేము సీఎం కేసీఆర్ వెంటే ఉంటాం..మా ఎదుగుదలకు ఆండగా నిలిచిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం మళ్లీ వస్తుంది.

-సుండు స్వామి, సిద్దిపేట జిల్లా కేంద్రంలోని 15వవార్డు




మెదక్‌లో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, పాల్గొన్న ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి

# కేసీఆర్ లేకుంటే తెలంగాణ వచ్చేది కాదు

- తెలంగాణ రాకుంటే మెదక్ జిల్లా అయ్యేది కాదు
- అభివృద్ధిలో పరుగులు తీస్తున్న మెదక్ జిల్లా
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు

మెదక్ అర్బన్, నవంబర్ 1: కేసీఆర్ లేకుంటే తెలంగాణ వచ్చేది కాదని, తెలంగాణ రాకుంటే మెదక్ జిల్లా అయ్యేది కాదని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు అన్నారు. బుధవారం మెదక్ పట్టణం, మెదక్ రూరల్, హవేళీ ఘనపూర్ మండల్లాలో కార్యకర్తలతో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో మంచి నిర్ణయం తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో వచ్చేది పక్కగా బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనన్నారు. పార్టీ అనేది తల్లి లాంటిదని, దాన్ని ప్రతి కార్యకర్త కాపాడుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటే మన పంటలకు నీళ్లు వచ్చేవా, నీళ్ల కోసం పడ్డ కష్టాలు తొలిగిపోయేవా అని ప్రశ్నించారు. కర్ణాటకలో అక్కడి రైతుల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్లయ్యిందన్నారు. డీకే శివకుమార్ స్వయంగా ఐదు గంటల కరెంటు ఇస్తున్నట్లు ఒప్పుకున్నారన్నారు. మన తెలంగాణలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే అలాంటి పరిస్థితులు వస్తాయన్నారు. ఏడాదికి 25 వేల కోట్లు ఖర్చు చేసి నిరంతరం కరెంట్ ఇస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో 24 గంటల కరెంట్ ఇస్తున్న ప్రభుత్వం ఒక్క కేసీఆర్ ప్రభుత్వమేనని వెల్లడించారు. కాంగ్రెస్‌లో తన్నుకు నేవాళ్లే తప్ప, ప్రజల గురించి ఆలోచించేవారు లేరన్నారు. రైతుకు రూ.15 వేలు అన్నది రేవంత్‌రెడ్డి, కానీ కేసీఆర్ ప్రతి ఎకారాకు రూ.16 వేలు ఇస్తామని చెప్పారన్నారు. రూ.72 వేల కోట్లు డైరెక్ట్‌గా రైతుల ఖాతాల్లో వేసిన ఘనత కేసీఆర్‌దన్నారు. రైతు నాయకుడు, రైతు బాంధవుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. అన్ని కుంటుంబాలకు రూ.5 లక్షల బీమా ఇవ్వబోతున్నామన్నారు. కొత్త ఆఫీసులు తరలింపు అనేది ఉత్త మాట అని నాలుగు కొత్తవి తెస్తాం కానీ ఎందుకు వెళ్తాయన్నారు.

### గ్రామాలను పరిపుష్టం చేశాం.. ఓటేయండి : ఎమ్మెల్సీ శేరి

ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో గ్రామాలను పరిపుష్టం చేసిన బీఆర్‌ఎస్ పార్టీకి ఓటేసి కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో కష్టపడ్డ వారికి పదవులు లభిస్తాయన్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకుంటానని మంత్రి హరీశ్‌రావు హామీనిచ్చారని ఎమ్మెల్సీ తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ కష్టపడి పార్టీ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని ఎమ్మెల్సీ కోరారు. సమావేశంలో మెదక్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి, మెదక్ నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు దేవేందర్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి, మెదక్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, పీఏసీఎస్ చైర్మన్ హనుమంత్‌రెడ్డి, హవేళీఘనపూర్, మెదక్ ఎంపీపీలు శేరి నారాయణరెడ్డి, యమునా, మండలాల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, అంజాగౌడ్, నాయకులు మాణిక్యరెడ్డి, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.


పాల్గొన్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

## కారు ఆపి.. పోలీసులకు సహకరించి

### మంత్రి కేటీఆర్ వాహనాన్ని తనిఖీ చేసిన పోలీసులు


మనోహరాబాద్ మండలం కాళ్లకల్ చెక్‌పోస్ట్ వద్ద మంత్రి కేటీఆర్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

మనోహరాబాద్, నవంబర్ 1: బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఎన్నికల ప్రచార నిమిత్తం హైదరాబాద్ నుంచి కామారెడ్డి వెళ్తున్నారు. మార్గమధ్యలో మెదక్ జిల్లా మనోహరాబాద్ మండ లం కాళ్లకల్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద మంత్రి కేటీఆర్ వాహనాన్ని పోలీసులు, ఎన్నికల సిబ్బంది ఆపి తనిఖీ చేశారు. మంత్రి తనిఖీ చేస్తున్న అధికారులకు పూర్తిగా సహకరిస్తూ, తనిఖీ పూర్తయ్యేంత వరకు అక్కడే ఉన్నారు. వాహన తనిఖీ పూర్తయిన అనంతరం మంత్రి కేటీఆర్ కామారెడ్డికి బయలుదేరి వెళ్లారు.

# బీఆర్‌ఎస్‌తోనే మెదక్ అభివృద్ధి

### ముఖ్య కార్యకర్తల సమావేశంలో మంత్రి హరీశ్‌రావు

పాపన్నపేట, నవంబర్ 1: మెదక్ అభివృద్ధి కేవలం బీఆర్‌ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు అన్నారు. బుధవారం పాపన్నపేట మండలంలోని లక్ష్మీనగర్ గ్రామ శివారులో గల ఎస్ఆర్ గార్డెన్‌లో ముఖ్యకార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ ఎవరెన్ని ట్రిక్కులు చేసినా ముఖ్యమంత్రి కేసీఆర్ మరో మారు సీఎంగా హ్యాట్రిక్ కొట్టడం ఖాయమన్నారు. ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ప్రజల్లో ఉండి, నియోజక అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఆమెను గెలిపించుకోవాల్సిన అవసరం ప్రతీ కార్యకర్తపై ఉన్నదన్నారు. కొంతమంది హైదరాబాద్ నుంచి బెంజ్ కారులో వచ్చి ఆత్మగౌరవం గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందనిపేర్కొన్నారు.

**బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు**

మంత్రి హరీశ్‌రావు సమక్షంలో పాపన్నపేట మండలంలోని ఎల్లాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. గ్రామ మాజీ సర్పంచ్ బేగరి యాదయ్యతో పాటు నాలుగో వార్డు సభ్యుడు పుట్టి నరసింహులు, నాయకులు విజయరావు, దాసయ్య, అనిల్ కుమార్, అంబాదాస్ పార్టీలో చేరారు. వీరికి మంత్రి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్ రెడ్డి, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు సోములు, పార్టీ మండలాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, పాపన్నపేట వ్యవసాయయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఏడుపాయల దేవస్థానం కమిటీ చైర్మన్ బాలాగౌడ్, చిత్రియాల్ సర్పంచ్ బైరి సులోచనా రాజయ్య, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఏడుకొండలు, బాపూరావు తదితరులు పాల్గొన్నారు.


బీఆర్‌ఎస్‌లో చేరుతున్నఎల్లాపూర్ నాయకులు



## కేసీఆర్ పాలనలో కరువు లేదు.. కర్ఫ్యూ లేదు


చిన్నశంకరంపేటలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

చిన్నశంకరంపేట, నవంబర్ 1: 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో రైతులకు ఏం చేశారని మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రమైన నార్సింగ్‌లో చిన్నశంకరంపేట, ఉమ్మడి మండల కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హరీశ్‌రావు హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే కరెంటు కష్టాలు తప్పవన్నారు. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్‌వన్‌గా ఉంచారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఎక్కడ చూసిన పచ్చని పంటలతో కళకళలాడుతుందన్నారు. 60ఏండ్లలో చేయని అభివృద్ధి 10 ఏండ్లలో చేసి చూపించారని తెలిపారు. ధాన్యం దిగుబడిలో పంజాబ్ రాష్ట్రాన్ని తలదన్నేలా తయారైందన్నారు. కేసీఆర్ పాలనలో కరువు లేదు కర్ఫ్యూ లేదన్నారు. బియ్యం కావాలని ఇతర రాష్ట్రాల వారు తెలంగాణ రాష్ట్రాన్ని కోరుతున్నారని తెలిపారు. కారు గుర్తుకు ఓటు వేసి పద్మాదేవేందర్‌రెడ్డిని అత్యధిక మోజార్టీతో గెలిపించాలని సూచించారు. సమావేశంలో ఇఫ్కోడైరెక్టర్ దేవేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, జడ్పీటీసీలు లక్ష్మారెడ్డి, మాధవి, రైతుబంధు మండలాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న బిఆర్‌ఎస్ కార్యకర్తలు